నిరుద్యోగ భృతి ఊసేది?

- నిరుద్యోగ యువత ఎదురుచూపులు
- అధికారంలోకి రాగానే ఇస్తామన్న బాబు
- పగ్గాలు చేపట్టి నెలరోజులు గడిచినా ప్రకటించని వైనం
- ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలని యువత డిమాండ్



ఉదయగిరి/కావలి/ఆత్మకూరు: 'జాబు రావాలంటే బాబు రావాలి..తమ్ముళ్లూ మీ కలలను సాకారం చేయబోతున్నా..ఇంటికొక ఉద్యోగం ఇస్తా.. ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తా..మీరేమీ చదువుకోకపోయిన నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2వేలు ఇస్తా..' ఈ హామీ గుర్తుందా? 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ.. అప్పట్లో టీడీపీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నిరుద్యోగ భృతి హామీని అటకెక్కించారు. ఉద్యోగాల కల్పనను విస్మరించారు. 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు ముఖ్యమంత్రి యువ నేస్తం పేరుతో కొద్దిమందికి మాత్రమే రూ.వేయి అందజేశారు. చంద్రబాబు మాయలో పడిన నిరుద్యోగులు ఐదేళ్ల పాటు విలవిల్లాడారు. మరోసారి అలాంటి హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఊసెత్తకపోవడంపై నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగభృతిని ప్రకటించింది. 'తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పెద్దపీట వేస్తాం..ఇంటికొక ఉద్యోగం కల్పిస్తాం..లేకపోతే వచ్చే వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతిని ఇస్తాం' అని చంద్రబాబు ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగ భృతిపై నిరుద్యోగ యువత గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబు పగ్గాలు చేపట్టి నెలరోజులకు పైగా గడిచినా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలని యువత డిమాండ్ చేస్తున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో..

ఉదయగిరి నియోజవర్గంలో 70వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో సగటున ఒక్కరు చొప్పున నిరుద్యోగులు ఉన్నారు. ఈ లెక్కన దాదాపు 70 వేల మందికి ఉద్యోగం లేదా రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి అందించాల్సి ఉంది. కానీ ఇంత వరకు కూటమి ప్రభుత్వం దానిపై స్పష్టత ఇవ్వలేదు. 2014లో కూడా ఈ తరహా హామీ ఇచ్చిన బాబు అధికారం చేపట్టాక అటకెక్కించారు. దీంతో బాబు హామీపై నిరుద్యోగ యువతలో అనుమానం రేకెత్తుతోంది.

కావలి నియోజకవర్గంలో..

కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణం, మండలం, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లో సుమారు 50 వేల మంది నిరుద్యోగ యువత ఉన్నారు. వీరిలో అధిక శాతం మంది డిగ్రీలు పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. సుమారు 25 నుంచి 30 శాతం మంది మాత్రమే ఇంటర్ వరకు చదివి వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ పొంది ఉన్నారు. వీరందరికీ ఉద్యోగాలు కల్పించే వరకు ప్రతి నెలా రూ.3 వేలు వంతున నిరుద్యోగభృతి చెల్లించాల్సి ఉంది. ఉద్యోగాలు లేని కారణంగా దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాల్లోని యువత, తీరప్రాంత మత్స్యకార యువత ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారు. ప్రభుత్వం నిరుద్యోగభృతి చెల్లిస్తే పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకోవడం, వృత్తివిద్యా కోర్సుల్లో తర్ఫీదు పొందేందుకు అవకాశం ఉంటుందని యువత చెబుతున్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో...

ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 30వేల మందికిపైగా నిరుద్యోగ యువత ఉన్నారు. వీరిలో అధిక శాతం మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల అన్వేషణలో ఉన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతిని అందిస్తామన్న హామీని ఇవ్వడంతో గంపెడాశలు పెట్టుకున్నారు. అయితే నెలరోజులు గడిచినా నిరుద్యోగ భృతి ఊసెత్తకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. నిరుద్యోగ భృతిని అందజేసి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

న్యాయం చేయాలి



నేడు డిగ్రీ వరకు చదివా. ఉద్యోగ వేటలో ఉన్నా. పోటీ పరీక్షల శిక్షణకు ఇంట్లో వారిపై ఆధారపడాల్సి వస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ఇస్తే ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకు కొర్రీలు వేయకుండా అందరికీ న్యాయం చేయాలి.

– బాషా,ఉదయగిరి

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను 2015లో డిగ్రీ పూర్తి చేశా. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా ఇంత వరకు రాలేదు. 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందజేస్తానని హామీ ఇవ్వడంతో నిరుద్యోగులందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఎటువంటి షరతులు లేకుండా అర్హులైన నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందజేయాలి.

–కానుపర్తి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

భృతిని ప్రకటించాలి



నేను డిగ్రీ చదివా. జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నా. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడిచినా ఇంత వరకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వలేదు. 2014లో చంద్రబాబు అధికారం కోసం నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి యువతను మోసం చేశారు. ఈ దఫా అయినా ఇచ్చిన మాట ప్రకారం జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగభృతిని ప్రకటించాలి

– ఎల్ వంశీ, వింజమూరు

భృతిపై స్పష్టత ఇవ్వాలి



డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నా. కోచింగ్ కోసం వేలల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే ఖర్చులకు ఉపయోగపడుతుందని ఆశగా ఎదురుచూస్తున్నా. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నందున నిరుద్యోగ భృతి హామీపై వెంటనే స్పష్టత ఇవ్వాలి.

– గోపి శశికుమార్, దేవమ్మచెరువు

హామీని నిలుపుకోవాలి



నేడు డిగ్రీ చదివి పీఈటీ శిక్షణను సైతం పూర్తి చేశా. భృతిపై నిరుద్యోగ యువత గంపెడాశలు పెట్టుకుని ఉన్నారు. గతంలో మాదిరిగా మోసం చేయకుండా సీఎం చంద్రబాబు తక్షణమే నిరుద్యోగ భృతిని అందజేసి ఇచ్చిన హామీని నిలుపుకోవాలి.

– కనుమర్లపూడి పవన్‌కుమార్, సీతారామపురం

అందరికీ ఇవ్వాలి



ఉద్యోగాలు లేక కుటుంబానికి ఆర్థికంగా భారం అవుతున్నాం. ఎన్నికల సమయంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పిస్తాం..లేకపోతే నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆశలు పెట్టుకున్నాం. ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడిచినందున వెంటనే నిరుద్యోగ భృతిని ప్రకటించాలి.

–యతీష్, నిరుద్యోగి, కావలి

ఆర్థిక భారం తగ్గుతుంది



నేను బీటెక్ పూర్తి చేశా. ఉద్యోగావకాశాలు లేవు. తండ్రి లేకపోవడంతో తల్లే కష్టపడి పెంచుతోంది. ఇంకా తల్లిపై ఆధారపడాలంటే బాధగా ఉంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే ఏదైనా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆర్థిక భారం తగ్గుతుంది.

.. చల్లా సుస్మిత, ఆత్మకూరు

మాట తప్పకుండా భృతి ఇవ్వాలి



నేను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశా. సరైన ఉద్యోగావకాశం లభించకపోవడంతో ఇంటి దగ్గరే ఉన్నా. తల్లిదండ్రులపై ఆధారపడాలంటే బాధగా ఉంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే ఉద్యోగ ప్రయత్నాలకు కొంచెం ఆదరువుగా ఉంటుంది. చంద్రబాబు గతంలో మాదిరిగా మాట తప్పకుండా వెంటనే భృతి కల్పించాలి.

– వై కస్మూర్‌రెడ్డి, ఆత్మకూరు

మాట తప్పడం బాబు నైజం



నేను డిగ్రీ పూర్తి చేశా. చిన్న ఉద్యోగమైనా వస్తుందా అని ఎదురుచూస్తున్నా. ఉద్యోగాల దరఖాస్తు ఖర్చులకు ఇంట్లో వారిని అడగాలంటే ఇబ్బందికరంగా ఉంది. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇవ్వడంతో ఆయన మాటలను నమ్మాం. ఇప్పటికీ భృతిపై ప్రకటన చేయకపోవడం చూస్తే మాట తప్పడం బాబు నైజమని అర్థమవుతోంది.

–హరికృష్ణారెడ్డి, ఏఎస్‌పేట

యువతను మోసం చేయడం తగదు



నేను బీఫార్మశీ పూర్తి చేశా. ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నిస్తూ ఇంటి దగ్గర ఖాళీగా ఉన్నా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తే తోడ్పాటుగా ఉంటుందని ఆశ పడ్డా. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా యువతను మోసం చేయడం సరికాదు.

: మన్నెం విష్ణువర్ధన్, దేవరాయపల్లి

నిరుద్యోగులకు ఎంతో మేలు



నేను ఐటీఐ డీజిల్ మెకానిక్ కోర్సు పూర్తి చేశా. ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న. ఏ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా డబ్బులు కావాలి. ప్రతిదానికి ఇంట్లో వారిని అడగడం బాధగా ఉంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే నిరుద్యోగులకు ఎంతో మేలు కలుగుతోంది.

– మెట్టుకూరు మధుసూదన్‌రెడ్డి, అనంతసాగరం

ఆశగా ఎదురుచూస్తున్నా



నేను ఐటీఐ పూర్తి చేశా. ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్నా. ఇంకా ప్రతి ఖర్చుకు తల్లిదండ్రులపై ఆధారపడాలంటే ఇబ్బందిగా ఉంది.ఇటీవల ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వస్తే ఖర్చులకు ఇబ్బంది ఉండదని ఆశగా ఎదురుచూస్తున్నా.

– డీ ప్రశాంత్, దేవరాయపల్లి, అనంతసాగరం మండలం

కుటుంబంపై ఆధారపడాల్సి వస్తోంది



నేను బీటెక్ పూర్తి చేశా. ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్నా. దరఖాస్తుల ఖర్చులకు కుటుంబంపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే ఎవ్వరిపైన ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఇచ్చిన హామీ నెరవేర్చడానికి చంద్రబాబు వెంటనే కృషి చేయాలి.

– ఎం మాధవరెడ్డి, డీసీపల్లి, మర్రిపాడు మండలం

యువతను మోసం చేయడం తగదు



నేను ఎంబీఏ పూర్తిచేశా. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి హామీలపై ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టకుండా కాలయాపన చేయడం బాధాకరంగా ఉంది. యువతను నమ్మించి మోసం చేయడం మంచిది కాదు. యువత తిరగబడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి వెంటనే మంజూరు చేయాలి.

–కంచర్ల చైతన్య కుమార్, సంగం మండలం

మాట తప్పడం తగదు



నేను బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశా. ఏడాదికాలంగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. ఎన్నికల సమయంలో ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి హామీ ఇవ్వడంతో చంద్రబాబుకు మద్దతు తెలిపాం. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను పట్టించుకోకపోవడం చూస్తే చంద్రబాబు మాట తప్పాడన్న విషయం అర్థమవుతోంది.

– ఎం అజయ్‌రెడ్డి, సంగం మండలం

పుట్టగతులు ఉండవు



గతంలో మాదిరిగా నిరుద్యోగ భృతి హామీపై మాట తప్పితే చంద్రబాబుకు పుట్టగతులు ఉండవు. అప్పటో భృతి ఇస్తానని నిరుద్యోగులను నమ్మించి చివరిలో కొద్ది మందికి మాత్రమే అందజేశారు. ఈ దఫా అయినా అందరికీ నిరుద్యోగ భృతి ఇచ్చి యువత ఉసురు తగలకుండా చూసుకోవాలి.

– పీ సుధీర్, అనుమసముద్రం

క్లుప్తంగా

ఫ్యామిలీడాక్టర్ సేవలు

వరికుంటపాడు: కనియంపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి కరిష్మా 35 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

అనుమసముద్రంపేట: మండలంలోని ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన యశితకు పూర్వ విద్యార్థులు పానుగోటి మనోహర్‌రెడ్డి, కుమారులు మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి రూ.10వేలు ప్రోత్సాహకాన్ని సోమవారం అందజేశారు. అపస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభకనబర్చిన కే మోహన్‌నరేంద్రకు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు నాగభూషణం తన సతీమణి సత్యవతమ్మ జ్ఞాపకార్థంగా రూ.10వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

ఆత్మకూరు: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద హెల్మెట్ ధారణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ఇక నుంచి హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వాహనచోదకులపై పోలీసులు కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ డీవీఎస్ ప్రసాద్, జైల్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో జాతీయ రహదారి సమీపంలో నాలుగురోజులుగా కొందరు మున్సిపల్ కార్మికుల పేరుతో యథేచ్ఛగా ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపట్టారు. ఈ వ్యవహారంపై పలువురు ఆర్డీఓ మధులత, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు యతి్నంచగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పలువురు తమకు గతంలో పట్టాలు ఇచ్చారని చెప్పగా వాటిని తీసుకుని రావాలని అధికారులు సూచించారు. అయితే ఎవరూ తీసుకు రాకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టారు. కాగా కొందరి నిర్మాణాలను మాత్రమే తొలగించకపోవడంపై మిగిలిన వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా పక్షపాత వైఖరి చూపడం సరికాదని నిరసన తెలిపారు. ఓ వీఆర్వో తన కుటుంబ సభ్యుల పేర్లతో ఆరు ప్లాట్లు ఆక్రమించి ఉన్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన సూచనల మేరకే ఆక్రమణలు జోరందుకున్న విషయం అధికారులకు తెలియదా అని మండిపడ్డారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

సీతారామపురం: పడమటి రొంపిదొడ్లలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ పల్లె విజయమ్మ పరిష్కరించారు. మంచినీటి పథకాల మోటార్లు మరమ్మతులకు గురవడంపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై సర్పంచ్ స్పందించారు. మెకానిక్‌ను పిలిపించి మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రణీత్‌కు జాతీయ పురస్కారం

కావలి : పట్టణానికి చెందిన సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నల్లిపోగు ప్రణీత్ రాష్ట్రీయ సమాజ్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తమిళనాడు రాష్ట్రం ఊటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రణీత్‌కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా సమాజ సేవ చేస్తున్న నలుగురిని పురస్కారాలకు ఎంపిక చేయగా, అందులో ప్రణీత్ ఉండడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మర్రిపాడు: మండల పరిధిలోని నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలు..ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ విద్యుత్ లైన్ల పనుల నిమిత్తం ఆత్మకూరుకు వచ్చాడు. అందులో భాగంగా మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలిసి మర్రిపాడు వెళ్లి ఆత్మకూరుకు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పొంగూరుకండ్రిక–నందవరం మధ్యన గుర్తుతెలియని వాహనం తగిలి గాయాలతో రోడ్డుపై పడి ఉన్న గేదెను గమనించక ఢీకొని అదుపుతప్పి పడిపోయారు.. ఈ ప్రమాదంలో అజయ్ గాయపడగా 108 వాహనంలో ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు.

18 నుంచి కుష్టుపై సర్వే

జలదంకి: కుష్టు వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జలదంకి పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటిని సందర్శించి కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్రతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ పద్మజ, గట్టుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అమ్రిన్, హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సతీష్, శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

సీతారామపురం: మొహర్రం వేడుకల్లో భాగంగా సీతారామపురం, తురకపాళెం, నారాయణప్పపేట, ఎగువపాళెం గ్రామాల్లో సోమవారం పీర్ల ఊరేగింపు చేపట్టారు. సీతారామపురం మెయిన్‌బజారులో ఇరుగ్రామాల పీర్లు ఎదురెదురుగా వచ్చి సలాం అందుకున్నాయి.

మర్రిపాడు: మండలంలోని నందవరంలో పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల హజరత్ బాదుల్లా సాహెబ్ మస్తాన్‌వలీ పీర్ల మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సయ్యద్ అబ్దుల్ రెహమాన్, షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో తొలిరోజు పీర్లను ప్రతిష్ఠించారు. సయ్యద్ మహ్మద్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం గ్రామ వీధుల్లో పీర్లను ఊరేగించారు.



కలిగిరిలో పీర్ల ఊరేగింపు

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువత నృత్యాలతో సందడి చేశారు. పీర్ల ఊరేగింపులో కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

వరికుంటపాడు: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరికుంటపాడు పీహెచ్‌సీ హెల్త్‌ఆఫీసర్ పీ రాజశేఖర్‌రాజు సూచించారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లెలో డయేరియాపై వైద్యఆరోగ్య సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల కాచిచల్లార్చిన నీరు, వేడిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. డయేరియా లక్షణాలు ఉంటే మజ్జిగ, జావ, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీతారామపురం: మొహర్రం వేడుకల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి సీఐ గిరిబాబు హెచ్చరించారు. కోటవీధిలోని పీర్లచావిడి వద్ద పీర్ల ఉత్సవ కమిటీ సభ్యులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం పీర్లచావిడిలో కొలువుదీరిన సర్కారు (పోలీసు) పీరుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి, సీతారామపురం ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, అనూష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

వరికుంటపాడు: బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయను నివారించవచ్చని వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజశేఖరరాజు తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సచివాలయం పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులు క్షయ బారినపడకుండా వైద్యఆరోగ్యశాఖ ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్‌అసిస్టెంట్ రామరాజు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అల్లూరు మండలాభివృద్ధికి కృషి



అల్లూరు: మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన 'స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అల్లూరును నగర పంచాయతీ నుంచి పంచాయతీగా మారుస్తామని తెలిపారు. మండలంలో తాగునీరు, రోడ్లు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాజుపాళెం–ఇస్కపల్లి రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం చెత్తకుండీలను పంచాయతీల వారీగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎంపీపీ శిరీష, వైస్‌ఎంపీపీ గుమ్మడి సురేంద్ర, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ దుర్గేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

రాయలచెరువు పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని రాయలకాలం నాటి చెరువు దుస్థితిపై రైతు, కూలీ సంఘ నాయకులు ఇరిగేషన్ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు చెరువుతో పాటు తూములను పరిశీలించారు. ఇప్పటికే చెరువు అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేశామని, ఇప్పుడు గుర్తించిన మరమ్మతులను అందులో పొందుపరిచి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. రైతు సంఘ నాయకులు ఎల్‌కే ప్రసాద్, లక్ష్మీపతి పాల్గొన్నారు.